అనంతారంలో పశువుల తొట్టిలో నీటిని నింపుతున్న డీపీఓ సురేశ్‌కుమార్

వేసవిలో పశు పక్షాదులను సంరక్షించాలి

● డీపీఓ సురేశ్‌కుమార్

పెన్‌పహాడ్, మార్చి 22 : వేసవిలో ప్రకృతి వనాలు, పశు, పక్షాదులకు నీటిని అందించి సంరక్షించుకోవాలని డీపీఓ సురేశ్‌కుమార్ అన్నారు. శుక్రవారం గ్రీన్ డే ప్లై డేలో భాగంగా మండలంలోని అనంతారంలో ప్రకృతి వనాన్ని, పారిశుధ్యాన్ని పరిశీలించి మాట్లాడారు. ఈ సందర్భంగా అనంతారం ఉన్నత పాఠశాల దగ్గర ఉన్న పశువుల నీటి తొట్టిలో గ్రామ పంచాయతీ నీటి ట్యాంకర్ ద్వారా నీటిని తెప్పించి నీటిని నింపారు. గ్రామంలో క్షేత్రస్థాయిలో పర్యటించి కనీస సౌకర్యాలపై స్థానికులను ఆరా తీశారు. గ్రామంలోని చేతి పంపులను పరిశీలించారు. గ్రామంలో చెత్త ట్రాక్టర్ వినియోగం, మురుగు కాల్వ పరిశుభ్రం, వీధి దీపాల నిర్వహణపై గ్రామస్తులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఎంపీఓ నరేశ్, పంచాయతీ కార్యదర్శి రాజేశ్, సిబ్బంది పాల్గొన్నారు.

ఐలాపురంలో స్కింబోర్ మోటర్‌ను పరిశీలిస్తున్న ఆర్డీఓ వేణుమాదవ్

తాగునీటి సమస్యలు తలెత్తకుండా చర్యలు చేపట్టాలి

● ఆర్డీఓ వేణుమాదవ్

చివ్వెంల, మార్చి 22 : గ్రామాల్లో తాగునీటి సమస్యలు తలెత్తకుండా ఎప్పటికప్పుడు పర్యవేక్షించి చర్యలు చేపట్టాలని ఆర్డీఓ వేణుమాధవ్ అధికారులకు సూచించారు. శుక్రవారం మండలంలోని ఐలాపురం, గాయంవారిగూడెం గ్రామాల్లో భూగర్భ జలాలు అడుగంటుతున్న వేళ గ్రామాల్లోని స్కింబోర్ మోటర్లు పరిశీలించి మాట్లాడారు. గ్రామాల్లో తాగునీటి సమస్యలపై పంచాయతీ కార్యదర్శులతో పాటు మండల అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే అంతర్జాతీయ జల దినోత్సవం సందర్భంగా ఎంపీడీఓ కార్యాలయంలో సామూహిక ఇంకుడు గుంతలను తాసీల్దార్ కృష్ణయ్య, ఎంపీడీఓ సంతోశ్‌కుమార్ పరిశీలించి జల ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమాల్లో ఎంపీఓ గోపి, ఏపీఓ నాగయ్య, పంచాయతీ కార్యదర్శులు ఉపాధి హామీ సిబ్బంది పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న హుజూర్‌నగర్ సీఐ చరమంద రాజు

రూ.50 వేలకు పైగా తీసుకెళ్లేవారు బిల్లులు చూపించాలి

● సీఐ చరమంద రాజు

పాలకవీడు, మార్చి 22 : రూ.50 వేలకు పైగా నగదును తీసుకువెళ్లే ప్రయాణికులు చెక్‌పోస్టుల వద్ద బిల్లులు తప్పనిసరిగా చూపించాలని హుజూర్‌నగర్ సీఐ చరమంద రాజు అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో పోలీస్ స్టేషన్‌ను ఆయన తనిఖీ చేసి రికార్డులకు పరిశీలించారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా ఎన్నికల కోడ్ అమలులో ఉన్నదని, నేరేడుచర్ల మండలంలోని చిల్లేపల్లి వద్ద, మఠంపల్లి మండలం మట్టపల్లి బ్రిడ్జి వద్ద చెక్‌పోస్టులను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఇప్పటి వరకు మట్టపల్లి బ్రిడ్జి వద్ద రూ.27 లక్షల విలువైన బట్టలను, చిల్లేపల్లి చెక్‌పోస్ట్ వద్ద రూ.2 లక్షలను సీజ్ చేసినట్లు తెలిపారు. ఆన్‌లైన్ లావాదేవీలపై సైతం నిఘా కొనసాగుతున్నట్లు వెల్లడించారు. నియోజకవర్గ వ్యాప్తంగా కూలీలను అధికంగా ఎక్కించుకు వెళ్తున్న 22 ఆటోలను గుర్తించి సీజ్ చేసినట్లు పేర్కొన్నారు. సమావేశంలో ఎస్ఐ లక్ష్మీనరసయ్య పాల్గొన్నారు.

పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థిని గెలిపించాలి

గరిడేపల్లి, మార్చి 22 : త్వరలో జరుగునున్న నల్లగొండ పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కార్మిక సంఘం నాయకుడు పిట్ట గణేశ్ శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. స్వార్థ రాజకీయాలు చేస్తూ ఎన్నికల్లో ఓట్లు అడిగేందుకు వస్తున్న బీజేపీ, కాంగ్రెస్ నాయకులకు ప్రజలు తగిన బుద్ధి చెప్పాలన్నారు. బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు పదవులను అనుభవించిన నాయకులు నేడు అధికారం పోగానే విమర్శలు చేయడం తగదన్నారు. నియోజకవర్గంలో ఎవరికి తెలియని సైదిరెడ్డిని తీసుకువచ్చి కేసీఆర్ ఎమ్మెలేగా గెలిపిస్తే పదవిని అనుభవించి పార్టీ అధికారం కోల్పోగానే మతతత్వ బీజేపీలో చేరడం దారుణమన్నారు. వ్యక్తిగత స్వార్థంతో పార్టీని వీడి నేడు ఎంపీ అభ్యర్థిగా బీజేపీ నుంచి పోటీ చేస్తున్న ఆయనకు పార్టీ నాయకులు తగిన బుద్ధి చెప్పాలని పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

హుజూర్‌నగర్ , మార్చి 22 : రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందిన ఘటన హుజూర్‌నగర్ పట్టణ పరిధిలోని మగ్దుంనగర్ సమీపంలో గల గంగమ్మ గుడి వద్ద జరిగింది. హుజూర్‌నగర్‌కు చెందిన పొనగంటి నర్సిరెడ్డి (58) మఠంపల్లిలోని పీఎస్‌టీ ట్రాన్స్‌పోర్ట్‌లో వాచ్‌మెన్‌గా పని చేస్తున్నాడు. శుక్రవారం రాత్రి బైక్‌పై విధులకు వెళ్తుండగా మగ్దుంనగర్ సమీపంలో ఈయన ప్రయాణిస్తున్న బైక్‌ను లారీ ఢీకొట్టడంతో అక్కడిక్కడే మృతి చెందాడు.

ఇసుక వ్యాపారులపై కేసు

కోదాడ రూరల్, మార్చి 22 : కోదాడ పట్టణంలో కొద్ది రోజులుగా ఇసుక వ్యాపారులు రెండు వర్గాలుగా ఏర్పాడి ఘర్షణలు పడుతుండటంతో ఏడుగురిపై క్రిమినల్ కేసులు నమోదు చేసినట్లు పట్టణ సీఐ రాము శుక్రవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనుమతులు లేని ఇసుక డంపులను రెవెన్యూ అధికారుల సమక్షంలో సీజ్ చేసినట్లు చెప్పారు. ఇసుక అక్రమ రవాణకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవన్నారు.

ఫణిగిరి సీతారామచంద్రస్వామి పరమ పదోత్సవం

నాగారం, మార్చి 22 : రాష్ట్రంలో రెండో భద్రాద్రిగా వెలుగొందుతున్న మండలంలోని ఫణిగిరి సీతారామచంద్రస్వామి దేవాలయ బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. రెండో రోజు గురువారం రాత్రి గ్రామస్తులంతా డప్పు వాయిద్యాలతో పరమ పదోత్సవం, ప్రబంద సేవాకాలం కార్యక్రమాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. కార్యక్రమంలో దేవాదాయ ధర్మాదాయ చైర్మన్ గట్టు లక్ష్మీకాంత్ (నర్సింహారావు), వైస్ చైర్మన్ కల్లెట్లపల్లి సోమయ్య, యాదగిరి, భిక్షం, నాగమణి, శంకరయ్య, రవీందర్ ఆచార్యులు, కూరేశం సంతోష్‌కుమార్, సాయిదత్తు పాల్గొన్నారు.

ఇంకుడు గుంతలతోనే నీటి సమస్య పరిష్కారం

● కలెక్టర్ ఎస్.వెంకట్రావ్

సూర్యాపేట : కార్యక్రమంలో మాట్లాడుతున్న కలెక్టర్ ఎస్.వెంకట్రావ్

సూర్యాపేట, మార్చి 22 : ప్రతి ఇంటికి ఒక ఇంకుడు గుంత ఉండాలని, వాటి ద్వారానే భూగర్భ జలాల పెరుగుదల ఉంటుందని కలెక్టర్ ఎస్.వెంకట్రావ్ అన్నారు. ప్రపంచ నీటి దినోత్సవాన్ని సందర్భంగా శుక్రవారం కలెక్టరేట్ ఎదురుగా నిర్వహించిన కార్యక్రమంలో అధికారులు, సిబ్బందితో కలిసి ఆయన ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. జీవకోటికి నీరే ప్రాణాధారమని, అటువంటి నీటిని కాపాడుకోవాల్సిన అవసరం ప్రతి ఒక్కరిపై ఉన్నదన్నారు. గ్రామాల్లో, మున్సిపాలిటీల్లో ప్రతి ఇంట్లో ఇంకుడు గుంత ఉండేలా అధికారులు అవగాహన కల్పించాలని సూచించారు. ఇప్పటికే నీటిని కొనుగోలు చేసి తాగే స్థితికి చేరుకున్నట్లు, వనరులను జాగ్రత్తగా వాడుకోకపోతే భవిష్యత్‌లో ఇబ్బందులు తప్పవన్నారు. సీప్ కార్యక్రమంలో భాగంగా ప్రతి ఒక్కరూ నీరు పోసి మొక్కని కాపాడాలి–ఓటు వేసి ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించాలని నినదించారు. కార్యక్రమంలో డీఆర్‌డీఓ మధుసుదన్‌రాజు, జడ్పీ సీఈఓ అప్పారావు, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్, ఏఓ సుదర్శన్‌రెడ్డి పాల్గొన్నారు.

భూగర్భ జలాల పరిరక్షణ అందరి బాధ్యత

మఠంపల్లి : భూగర్భ జలాల పరిరక్షణ అందరి బాధ్యత అని సాగర్ సిమెంట్స్ పరిశ్రమ వైస్ ప్రెసిడెంట్ ఎంవీ రమణమూర్తి అన్నారు. ప్రపంచ నీటి దినోత్సవాన్ని పురస్కరించుకుని సాగర్ సిమెంట్స్ పరిశ్రమలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. నీటి ప్రాముఖ్యత, నీటి లభ్యత, భూగర్భ జలాలను మెరుగు పరిచేందుకు తీసుకోవాల్సిన చర్యలపై సిబ్బంది, కార్మికులకు అవగాహన కల్పించారు. గృహ అవసరాలకు అనుగుణంగా నీటి వినియోగం, వర్షపు నీటిని ఒడిసి పట్టి భూగర్భ జలాలను పెంచుకోవడం, మురుగునీటిని శుద్ధి చేసుకునే పద్ధతులను వివరించారు. కార్యక్రమంలో పరిశ్రమ పర్యావరణ విభాగాధిపతి నాగేశ్వర్ రావు, ఉద్యోగులు హరిదాస్, వెంకట్‌రెడ్డి, అనిల్ పాల్గొన్నారు.

లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో..

నేరేడుచర్ల : మండలంలోని చింతకుంట్ల ప్రాథమిక పాఠశాలలో లయన్స్ క్లబ్ నేరేడుచర్ల ఆధ్వర్యంలో నీటి దినోత్సవాన్ని నిర్వహించారు. విద్యార్థులకు నీటి వినియోగం, నీటి ఆవశ్యకత, డ్రాయింగ్, వ్యాసరచన పోటీలు నిర్వహించారు. విజేతలకు లయన్స్ క్లబ్ అధ్యక్షుడు చల్లా ప్రభాకర్‌రెడ్డి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో హెచ్ఎం నాగార్జున రెడ్డి, క్లబ్ కార్యదర్శి జిలకర రామస్వామి, ఉపాధ్యక్షుడు కర్రి సూర్యనారాయణరెడ్డి, మాతంగి సైదులు ఉపాధ్యాయుడు ఎస్‌కె రఫి పాల్గొన్నారు.

తిరుమలగిరి : మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో అధికారులు, ప్రజా ప్రతినిధులు ఎంపీఓ మారయ్య ఆధ్వర్యంలో ప్రతి నీటి చుక్కను ఒడిసి పట్టాలని ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులు సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

● షీ టీమ్స్ ఎస్ఐ ప్రవీణ్‌కుమార్

కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎస్ఐ ప్రవీణ్‌కుమార్

గరిడేపల్లి, మార్చి 22 : విద్యార్థులు సైబర్ మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలని షీ టీమ్స్ ఎస్ఐ ప్రవీణ్‌కుమార్ అన్నారు. మండలంలోని గడ్డిపల్లి గ్రామంలో గల ఆదర్శ పాఠశాలలో శుక్రవారం జిల్లా షీ టీమ్స్ కళాబృందం ఆధ్వర్యంలో మహిళలు, విద్యార్థుల రక్షణ చట్టాలు, విద్యా విధానాలు, సమస్యలను అధిగమించడం, సోషల్ మీడియా, ఇంటర్నెట్ సద్వినియోగం లాంటి అంశాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ.. విద్యార్థులు ఏమైనా సమస్యలు ఉంటే అధ్యాపకులు, అధికారుల దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించుకోవాలన్నారు. మానసిక ధైర్యంతో ఏ సమస్యనైనా ఎదుర్కొంటూ తల్లిదండ్రుల కలలను నెరవేర్చడాన్ని విద్యార్థులు బాధ్యతగా స్వీకరించాలని సూచించారు. కార్యక్రమంలో గరిడేపల్లి ఎస్ఐ–2 నరేశ్, పాఠశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ భార్గవి, షీ టీమ్స్ హెడ్ కానిస్టేబుల్స్ జాఫర్, యల్లారెడ్డి, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

పంట రుణాలను వెంటనే మాఫీ చేయాలి

● సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు పాండునాయక్

మఠంపల్లి : సమావేశంలో మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు పాండునాయక్

మఠంపల్లి, మార్చి 22 : కాంగ్రెస్ ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు రైతాంగానికి వెంటనే రుణ మాఫీ చేయాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు భూక్య పాండునాయక్, మండల కార్యదర్శి మాలోతు బాలునాయక్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ.. రుణమాఫీ కాకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు తెలిపారు. రైతు బంధు డబ్బులు కేవలం 3 ఎకరాలకు మాత్రమే ఇచ్చారని మిగిలిన రైతులకు వెంటనే అందించి, రూ.2 లక్షల రుణమాఫీ చేయాలని పేర్కొన్నారు. సమావేశంలో పార్టీ మండల కమిటీ సీనియర్ నాయకుడు ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి, సయ్యద్ రన్‌మియా, కె.వెంకట్‌రెడ్డి, రాము, పొదిలి రవి, చల్ల లింగయ్య, శంబయ్య, అప్పయ్య పాల్గొన్నారు.

గరిడేపల్లి : కాంగ్రెస్ ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీ మేరకు రైతులకు వెంటనే రూ.2 లక్షల రుణమాఫీ చేయాలని సీపీఎం మండల కార్యదర్శి షేక్ యాకూబ్ అన్నారు. మండలంలోని కీతవారిగూడెం గ్రామంలో జరిగిన పార్టీ నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వరికి మద్దతు ధర క్వింటాకు రూ.2,500 అందేలా చూడాలన్నారు. సమావేశంలో నాయకులు బొల్లేపల్లి శ్రీనివాస్, వెంకటేశ్వర్లు, నారాయణ, రామస్వామి, భిక్షం, అంకయ్య, సైదయ్య పాల్గొన్నారు.

సేంద్రియ వ్యవసాయంతో మిత్ర పురుగుల పరిరక్షణ

● కేవీకే శాస్త్రవేత్త ఆదర్శ్

జీవ శిలీంద్ర నాశనుల గురించి వివరిస్తున్న శాస్త్రవేత్త ఆదర్శ్

గరిడేపల్లి, మార్చి 22 : సేంద్రియ వ్యవసాయ విధానాలతో నేల, వాతావరణంలో మిత్ర పురుగులను పరిరక్షించుకోవచ్చని గడ్డిపల్లి కేవీకే సస్యరక్షణ శాస్త్రవేత్త డి.ఆదర్శ్ అన్నారు. మండలంలోని గడ్డిపల్లి గ్రామంలో గల కేవీకేలో సేంద్రీయ వ్యవసాయంపై యువతకు జరుగుతున్న ఏడు రోజుల శిక్షణ కార్యక్రమంలో శుక్రవారం ఆయన మాట్లాడారు. జీవ శిలీంద్ర నాశనులతో విత్తన శుద్ధి, నేలకు పశువుల పెంట తోలడం, తొలిదశలో ఆశించే రసం పీల్చే పురుగులకు జిగురు అట్టలను అమర్చుకోవడం, వేప నూనె పిచికారి చేయడం వంటివి చేయాలన్నారు. రెక్కల పురుగుల యాజమాన్యానికి లింగాకర్షక బుట్టలు అమర్చుకోవడం గురించి తెలిపారు. అలాగే జీవ నియంత్రణ పద్ధతుల్లో భాగంగా జీవ శిలీంద్ర నాశనులైన ట్రైకోడెర్మా, సూడోమోనాస్ వాడినచో అన్ని రకాల తెగుళ్ల నుంచి నివారించుకోవచ్చన్నారు. అలాగే బవేరియా బాసియానా, వర్టిసిల్లియం లకాని పిచికారి చేసినట్లైతే అన్ని రకాల పురుగులను సమర్థవంతంగా నివారించుకోవచ్చన్నారు. సేంద్రీయ వ్యవసాయంలో సమగ్ర సస్యరక్షణ చర్యలు ప్రారంభం నుంచి పాటించినట్లైతే తక్కువ ఖర్చుతో పురుగులు, తెగుళ్లను నివారించుకోవచ్చని తెలిపారు.

పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు

టీకాలు వేస్తున్న పశు వైద్యాధికారి శంకర్

మఠంపల్లి, మార్చి 22 : మండలంలోని చౌటపల్లి గ్రామంలో పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు పంపిణీ చేసినట్లు మండల పశు వైద్యాధికారి కట్టెల శంకర్, డాక్టర్ సుస్మిత తెలిపారు. శుక్రవారం వారు మాట్లాడుతూ.. గ్రామంలోని 12 ఆవులు, 520 బర్రెలకు గాలికుంటు వ్యాధి రాకుండా టీకాలు వేసినట్లు చెప్పారు. శనివారం పెదవీడు గ్రామంలో పశువులకు టీకాలు వేయనున్నట్లు వెల్లడించారు. టీకాలు వేసే వరకు పశువులను మేతకు వదలవద్దని రైతులను కోరారు. వివరాలకు 9121213858 నంబర్‌ను సంప్రదించవచ్చని పేర్కొన్నారు.

ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి ఎదుట ఆందోళన నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది, స్థానికులు

మా సూపరింటెండెంట్ మాకే కావాలి

● డాక్టర్ మురళీధర్‌రెడ్డిని కొనసాగించాలి

● సూర్యాపేట ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి ఎదుట ఉద్యోగులు, రోగులు, ప్రజల ఆందోళన

బొడ్రాయిబజార్, మార్చి 22 : సూర్యాపేట ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి సూపరింటెండెంట్‌గా డాక్టర్ మురళీధర్‌రెడ్డిని కొనసాగించాలని డిమాండ్ చేస్తూ వైద్య సిబ్బంది, వైద్య విద్యార్థులు, రోగులు, స్థానికులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం ఆస్పత్రి ఎదుట పెద్ద ఎత్తున ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా వెన్న శశిధర్‌రెడ్డి, శ్రీనివాస్ మాట్లాడుతూ.. నాలుగేండ్లుగా సూర్యాపేట ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో రోగులకు అత్యుత్తమ సేవలు అందిస్తూ రాష్ట్రంలోనే ఆస్పత్రికి గుర్తింపు తెచ్చిన వ్యక్తిని అకారణంగా బదిలీ చేయించడం దుర్మార్గమైన చర్య అన్నారు. బదిలీ విషయంలో రాజకీయ నిరుద్యోగులు కావాలనే వైద్య వృత్తిని కలుషితం చేస్తున్నారని మండిపడ్డారు. నిస్వార్థంగా సేవలందించే డాక్టర్ మురళీధర్‌రెడ్డిని కాదని రాజకీయ నాయకులు వారి స్వార్థం కోసం తమ అనుమగుల కోసం ఆయనను బదిలీ చేయడం సిగ్గు చేట్టన్నారు. బదిలీని వెంటనే విరమించి సూర్యాపేట ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి సూపరింటెండెంట్‌గా మురళీధర్‌రెడ్డినే కొనసాగించాలని కోరారు.

కలెక్టర్, రాష్ట్ర టూరిజం కార్పొరేషన్ చైర్మన్, ఎమ్మెల్యేలకు వినతులు..

జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో తెలంగాణ డెవలప్‌మెంట్ ఫోరం బోర్డు సభ్యులు గెల్లిపల్లి శ్రీనివాస్‌రెడ్డి, జి.శ్రీధర్, వేముల అంజి, జడ్పీటీసీ జీడి భిక్షం మాట్లాడుతూ.. రెండేండ్ల పదవీ కాలం ఉన్న డాక్టర్ మురళీధర్‌రెడ్డిని బదిలీ చేయడం సరికాదన్నారు. కరోనా సమయంలో రెండు రాష్ట్రాలకు వారధిగా ఉన్న సూర్యాపేట ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో ఉత్తమ సేవలు అందాయంటే అందుకు కారణం డాక్టర్ మురళీధర్‌రెడ్డి, సిబ్బందే కారణమన్నారు. రాజకీయాలను వైద్య రంగంలోకి తీసుకురావద్దన్నారు. ఈ మేరకు డాక్టర్ మురళీధర్‌రెడ్డిని సూపరింటెండెంట్‌గా కొనసాగించాలని కోరుతూ జిల్లా మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, టూరిజం కార్పొరేషన్ చైర్మన్ పటేల్ రమేశ్‌రెడ్డి, ఎమ్మెల్యేలు మందుల సామేల్, పద్మావతిరెడ్డి, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు రాంరెడ్డి దామోదర్‌రెడ్డి, కలెక్టర్ ఎస్.వెంకట్రావ్‌కు విజ్ఞప్తి చేసినట్లు తెలిపారు. సానుకూలంగా స్పందించిన టూరిజం కార్పొరేషన్ చైర్మన్ పటేల్ రమేశ్‌రెడ్డి బదిలీ విషయాన్ని సీఎం రేవంత్‌రెడ్డి, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ, జిల్లా మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి డాక్టర్ మురళీధర్‌రెడ్డిని సూర్యాపేట ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి సూపరింటెండెంట్‌గా కొనసాగించేందుకు శాయశక్తులా కృషి చేస్తానని తెలిపినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో శ్రీరంగం రాధాకృష్ణ, పల్స నగేశ్ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

కోదాడ రూరల్, మార్చి 22 : మండల పరిధి దొరకుంట ఇండస్ట్రీయల్ ఏరియా, తమ్మర, బండపాలెం గ్రామాలకు శనివారం ఉదయం 9 నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని రూరల్ ఏఈ ఆర్.శ్రీనివాస్‌రావు శుక్రవారం తెలిపారు. ఈ ఏరియా ఫీడర్లలో మరమ్మతుల కారణంగా విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని వెల్లడించారు.

బైక్‌పై వచ్చి పుస్తెలతాడు చోరీ

కోదాడ రూరల్, మార్చి 22 : పొలంలో గడ్డి కోస్తున్న మహిళపై బైక్‌పై వచ్చిన మహిళ, పురుషుడు దాడి చేసి పుస్తెలతాడు అపహరించుకుపోయారు. ఈ ఘటన శుక్రవారం మండలంలోని దొరకుంట గ్రామ శివారు జాతీయ రహదారిపై గల కోళ్లఫారం వెనుక జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన శిరంశెట్టి లక్ష్మీనారాయణ భార్య సరస్వతి పశువుల మేత కోసం తమ పొలంలో గడ్డి కోస్తుండగా గుర్తు తెలియని మహిళ, పురుషుడు బైక్‌పై వచ్చి దాడిచేసి మెడలోని పుస్తెలతాడు గుంజుకుని పారిపోయినట్లు తెలిపారు.

నాటు సారా పట్టివేత

హుజూర్‌నగర్, మార్చి 22 : జిల్లా సూపరింటెండెంట్ లక్ష్మానాయక్ ఆదేశాల మేరకు సూర్యాపేట, హుజూర్‌నగర్, కోదాడ ఎక్సైజ్ సిబ్బంది బృందాలుగా ఏర్పడి మఠంపల్లి, పాలకవీడు మండలాల్లో నాటు సారా తయారీ, అమ్మకందారులపై రైడ్ చేశారు. ఈ సందర్భంగా నాలుగు కేసులు నమోదు చేసి ముగ్గురిని అరెస్ట్ చేసినట్లు తెలిపారు. అలాగే 50 లీటర్ల సారా, 40 కిలోల బెల్లం స్వాధీనం చేసుకుని 400 లీటర్ల పానకాన్ని ధ్వంసం చేసినట్లు హుజూర్‌నగర్ ఎక్సైజ్ సీఐ నాగార్జునరెడ్డి తెలిపారు.

అనుమతులు లేకుండా మట్టి తవ్వకాలు చేస్తే చర్యలు

చింతలపాలెం, మార్చి 22 : అనుమతులు లేకుండా మట్టి తవ్వకాలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తాసీల్దార్ సురేందర్‌రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పులిచింతల ప్రాజెక్ట్ పరిధి, వెల్లటూరు రెవెన్యూ పరిధి, తమ్మవరం రెవెన్యూ ప్రాంతాల పరిధిలో అనధికారంగా, అనుమతులు లేకుండా భూ తవ్వకాలు జరుపుతున్నారనే సమాచారం తమకు అందినట్లు తెలిపారు. పులిచింతల ప్రాజెక్ట్ ముంపు ప్రాంతాల్లో అక్రమ తవ్వకాలు జరిపితే చట్టరీత్యా చర్యలు ఉంటాయని హెచ్చరించారు. మట్టి తవ్వకాలు జరుపడం వల్ల కాండూర్ లైన్‌లో ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉంటుందన్నారు.

గ్రామాల్లో ఐకేపీ కేంద్రాలు ప్రారంభించాలి

● సీపీఎం జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జున్‌రెడ్డి



బొడ్రాయిబజార్ : సమావేశంలో మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జున్‌రెడ్డి

బొడ్రాయిబజార్, మార్చి 22 : యాసంగి ధాన్యం చేతికి వచ్చినందున అన్ని గ్రామాల్లో వెంటనే ఐకేపీ కేంద్రాలను ప్రారంభించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జున్‌రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక ఎంపీఎన్ భవన్‌లో ఏర్పాటు చేసిన పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయక పోవడంతో రైతులు ధాన్యాన్ని దళారులకు అమ్మాల్సిన పరిస్థితి నెలకొన్నట్లు చెప్పారు. దాంతో గిట్టుబాటు ధర లభించక రైతులు తీవ్రంగా నష్టపోతున్నట్లు తెలిపారు. కాంగ్రెస్ ప్రకటించిన బోనస్ కూడా ఈ యాసంగిలో ఇవ్వాలన్నారు. గ్రామాల్లో నెలకొన్న తాగునీటి సమస్య పరిష్కారానికి అధికారులు యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపట్టాలన్నారు. ఎండిన వరి పంటకు ఎకరాకు రూ.25 వేలు నష్ట పరిహారం చెల్లించాలన్నారు. కరువులో పేదలను ఆదుకునేందుకు ప్రభుత్వం అన్ని గ్రామాల్లో ఉపాధి హామీ పనులను ప్రారంభించి 200 రోజులు పని కల్పించి రోజు కూలి రూ.600 ఇవ్వాలని పేర్కొన్నారు. సమావేశంలో పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు నెమ్మాది వెంకటేశ్వర్లు, మట్టిపల్లి సైదులు, కోట గోపి పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలి

నడిగూడెం : ప్రభుత్వం ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని రైతు సంఘం నాయకుడు ఏనుగుల వీరాంజనేయులు అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని రామాపురంలో ధాన్యం రాశులను పరిశీలించి మాట్లాడారు. ఎన్నికల ముందు ఇచ్చిన వాగ్దానం మేరకు పంటలకు మద్దతు ధర కల్పించాలన్నారు. అదనపు తూకం, తక్కువ ధరకు కొనుగోలు చేస్తున్న దళారుల భారీ నుంచి రైతులను రక్షించాలని కోరారు. క్వింటాకు రూ.500 బోనస్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో చిన్న కోటిరెడ్డి, పుల్లారెడ్డి, నర్సిరెడ్డి, సైదయ్య, భద్రయ్య, వెంకట్‌రెడ్డి, లక్ష్మయ్య, భూషయ్య పాల్గొన్నారు.

రేపు లక్ష్మీతిరుపతమ్మ–గోపయ్యస్వామి కల్యాణోత్సం

మేళ్లచెర్వు, మార్చి 22 : మండల కేంద్రంతో పాటు వేపలమాధవరం గ్రామంలో కొలువై ఉన్న లక్ష్మీతిరుపతమ్మ–గోపయ్యస్వామి వార్ల కల్యాణోత్సం ఆది వారం రాత్రి జరుగనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ సంబంధించిన ఏర్పాట్లు ముమ్మరంగా కొనసాగుతున్నట్లు వెల్లడించారు. ఆది, సోమవారాల్లో కుంకుమార్చనలు, కల్యాణం, అన్నదానం, లైటింగ్ ప్రభల ఊరేగింపు జరుగనున్నది. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

25న దాచారంలో

నేరేడుచర్ల : మండల పరిధిలోని దాచారం గ్రామంలో ఈ నెల 25న గోపయ్య సమేత తిరుపతమ్మ అమ్మవార్ల కల్యాణ మహోత్సవాన్ని అత్యంత వైభవంగా నిర్వహించడానికి ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఆలయ కమిటీ తెలిపింది. వేద పండితులు కొంకపాక రాధాకృష్ణ మూర్తి, ఆలయ పూజారి హరి సురేశ్‌కుమార్ శర్మ ఆధ్వర్యంలో ఈ 25న ఉదయం 5 గంటలకు మంగళవాయిద్యం, సుప్రభాత సేవ, 9 గంటలకు విఘ్నేశ్వర పూజ, పంచామృతాభిషేకం, నూతన వస్త్రాలంకరణ, పుష్పాలంకరణ, 10 గంటలకు శాంతి కల్యాణం, మధ్యాహ